# పందెం

ఈ వారం ఇల్లస్ట్రేటెడ్ వీక్లి చూసావటోయ్ శాస్త్రీ, సిగరెట్ పొగ సవిలాసంగా గాలిలోకి వదులుతూ అడిగాడు రెడ్డి.

"ఇందిరమ్మ ఘనత గురించేనా!" వంకరనవ్వు నవ్వాడు శాస్త్రీ.

"అయినా ఈ ఆడవాళ్లు మహా గడుసువాళ్ళు గురూ! వాళ్ళనర్థం చేసుకోవడం కన్న ఒక కొత్త గ్రహం కనిపెట్టడం సులభం!" తన అమూల్యాభిప్రాయాన్ని వెలిబుచ్చేడు వెంకట్రాజు.

ఇంతలో పూలరంగడిలా ఈలవేస్తూ స్టాఫ్ రూములోనికి అడుగు పెట్టాడు శ్రీధర్. అతనిని వెన్నంటుతూ లెక్చరర్స్ విద్యార్థులకు సానుభూతి చూపి సహకరించాలి. అన్న కేకలూ, ఈలలూ చప్పట్లూ వినవచ్చాయి.

"ఏం స్వామీ మన కుర్రవాళ్ళేమంటున్నారు? జావగారి పోతున్నారా లేక మరి కొన్నాళ్ళపాటు సాగిస్తారా? ఏదో వాళ్ళ ధర్మమా అని" శ్రీధర్‌ని ఆహ్వానిస్తూ బారజాపిన కాళ్ళని దగ్గరికి తీసుకుని పేక కట్ట పైకితీసాడు వీరాస్వామి.

"అంతతొందరగా ఏ పక్షాకీ తెలివి వస్తుందన్న భయం మనకక్కర్లేదుగానీ చాలా రసవత్తరమైన విషయం మీద సంభాషణ జరుగుతున్నట్టుందే..." అంటూ బూట్లు ఒక మూలకి విసిరేసి సుఖాసీనుడయ్యాడు శ్రీధర్.

"ఎందుకయినా మంచిది. రాజు దగ్గర పాఠాలు నేర్చుకోవయ్యా శ్రీధరం... త్వరలోనే నువ్వూ ఆ గోతిలోనే దిగుతున్నావుగా!" సుబ్బారావు వక్కపొడి నమలడం ఆపేసి సలహా యిచ్చాడు ఉచితంగా!

"అపరాధం గురూ! మనమంతా ఆయనదగ్గరే చదువుకో వలసిన వాళ్ళం. వెంకట్రాజు శ్రీధర్‌కి కన్ను మలుపుతూ అని నవ్వాడు.

"అంత ప్రావీణ్యముంటే మన సుశీలా దేవి సంగతి తేల్చమనండి. అందించారెవరో.

"సంగతేముంది బ్రదర్! ఈ వృద్ధ కన్యలు కొందరేమో అతి చనువుగా మసిలి, అనవసరంగా చిరునవ్వులొలకబోసి మగవాళ్లని తమచుట్టూ తిప్పుకోవాలనుకుంటారు. ఇంకొందరు తామేదో అందరాని చందమామలైనట్టు ముట్టుకుంటే గోల్డ్‌కంట్రోల్ తీరిపోతుందని భయపడుతున్నట్టు నవ్వితే ఫారినెక్ఛేంజి రాల్తుందన్నట్టు బెట్టు సరిపోయి మనల్ని వెంట తిప్పుకొందామనుకుంటారంతే." ఆడవాళ్ళ తత్వాన్ని కాచి వడబోసినట్టు నిదానంగా వివరించాడు శ్రీధర్.

"అయితే ఎవరు ఎన్నిసార్లు మాట్లాడించినా తుంచేసినట్టు సమాదానం చెప్పి చక్కాబోతుంది తప్ప కాస్త చిరునవ్వైనా చిందించదేం ఆమె!" శాస్త్రి ప్రశ్నించేడు.

శ్రీధర్ సాలోచనగా చూసాడు "అవునోయ్! నాకూఅదే అర్థంకాలేదు. కానీ నా ఉద్దేశమేమంటే ఆవిడ యిక తన నెవరూ ఇష్టపడరనీ, మగవాళ్ళని వెంటతిప్పుకునే చాకచక్యమూ, అందమూ తనకూ లేవనీ నిర్ధారణకొచ్చి ఆ నిరాశతో ఇలా అందరికీ దూరంగా ముభావంగా నిస్పృహగా వుండిపోతూందని కేవలం మర్యాద కోసం మనమంతా ఆవిడను పలకరిస్తున్నామని తెల్సి అలా దూరంగా వుంచుతూంది. కానీ ఎవరైనా ఆమె మీద శ్రద్ధాసక్తులు కనబరిస్తే ఆవిడ మారవచ్చు"

"ఆమెను మార్చడం మనతరం కాలేదని నోరు మూసుకుందాం గానీ అర్థం లేని థియరీలు చెప్పకోయ్ నువ్వు!"

శాస్త్రి గొంతులో ధ్వనించిన ఈసడింపు. హేళనచూసి శ్రీధర్‌కి మండిపోయింది. రోషంగాలేచి నిలబడి సవాలుచేస్తున్నట్టుగా అన్నాడు.

"నీ మాటనాకు తెలియదుగానీ కావాలంటే నేను ఆమెతో స్నేహంచేయడమే కాదు ఆమెను పూర్తిగా మార్చి నా థియరీ నిజమని నిరూపించగలను."

"పందెం! కవ్వించాడు శాస్త్రి.

"పందెం నేను ఓడిపోతే ఇది నీది" చేతికున్న వాచీతీసి టేబులుమీద పెట్టాడు శ్రీధర్.

"సరే! నువ్వు గెలిస్తే ఈ ఉంగరం నీది" వ్రేలికున్న ఉంగరం తీశాడు శాస్త్రి కానీ అతని మాట తీరులో ఎలాగూ నువ్వు ఓడిపోతావులే అన్న భావం ధ్వనించి శ్రీధర్ పట్టుదల మరింత పెరిగింది.

"గురూ! సుశీల వస్తూంది" వీరాస్వామి గాబరాగా హెచ్చరించడంతో అందరూ చాలా సిన్సియర్‌గా పుస్తకాలు పేపర్లూ చదవడంలో మునిగిపోయారు. మొహానికడ్డంగా పేపరుంచుకుని కను కొలుకుల్లోంచి ఆమెను గమనించ సాగాడు శ్రీధర్.

లేత నీలిరంగు చీరకట్టి దానికే మాత్రం నప్పని ఆకుపచ్చ పువ్వుల జాకెట్ తొడిగిందామె ముంగురుల కోసం తాపత్రయపడక చెవుల వెనక్కి దువ్వి వేసిన జడ. తేజో విహీనమైన కాటుక దిద్దని కనులు చిన్న కుంకుమబొట్టు. జిడ్డుగా వున్న మొహం. ఆమెకు అలంకరణమీద ఏ మాత్రం శ్రద్ధవుందో చాటుతున్నాయి.

ఆమె రిజిష్టర్‌లో సంతకంచేసి తలెత్తగానే చటుక్కున దృష్టిమరల్చుకున్నాడు శ్రీధర్.

X X X

"గుడీవినింగ్ మేడమ్" అంటూ ఇంట్లోకి అడుగుపెట్టిన శ్రీధర్‌ను చూసి ఆశ్చర్యపడింది సుశీలాదేవి.

క్షణంలో తేరుకుని "లోపలికి రండి" అంటూ అతి మామూలుగా ఆహ్వానించింది.

"చొరవగా ఇలా వచ్చినందుకేమీ అనుకోరు కదు" అంటూనే లోపలికి వచ్చి కూర్చున్నాడతను.

"ఇంతకీ ఏమిటిలా వచ్చారు!" సూటిగా ప్రశ్నించింది.

అలాంటి ప్రశ్న వస్తుందని ఎదురుచూడని శ్రీధర్ కాస్త తడబడ్డాడు. అంతలో నవ్వుతూ అన్నాడు "ప్రత్యేకంగా ఒక పనిమీద అని రాలేదండి ఏమిటో మనసు బావుండక బయటకు బయలుదేరాను. మీ ఇల్లు చూడగానే మీతో కాసేపు మాట్లాడితే బావుంటుందని పించింది."

అతని గొంతులో ధ్వనించిన నిజాయితీకి చలించిందామె. "ఫరవాలేదులెండి గానీ.." అంటూ సందిగ్ధంలో ఆగిపోయింది.

"ఏమిటలా సందేహిస్తున్నారు! కులాసాగా, జల్సాగా కనిపించే నాకు మనసు బాగోలేకపోవడమేమిటనా?" పేలవంగా నవ్వి అడిగాడు.

"అబ్బె... అదేం కాదులెండి కాఫీ తెస్తానుండండి" మొహమాటంగా అని లేచి లోపలికి వెళ్ళింది సుశీల.

ముందు గదే డ్రాయింగ్ రూమ్ కమ్ బెడ్‌రూమ్ అన్నట్టు ఒకవారగా మంచం మరొకవార నాలుగు కుర్చీలు ఉన్నాయి. టేబుల్‌మీద తెల్లని బుద్ధుని బొమ్మా, చిన్న రేడియో ఉన్నాయి. వంటింట్లో అలమారలో వెంకటేశ్వరుని ఫోటో ముందు దీపం వెలుగుతూంది.

"మనిషిలో ఉండే నిరాడంబరత ఇంటి అలంకరణలోనూ కనిపిస్తూంది." కాఫీ అందిస్తున్న సుశీలతో చనువుగా అన్నాడు శ్రీధర్.

ఒకక్షణం అతనికేసి చూసి, ఆ కళ్ళలో ఏ కల్మషమూ లేనట్టనిపించి మృదువుగా నవ్విందామె." సింప్లిసిటీని ఇష్టపడేవాళ్ళూ ఉంటారు గద?"

ఈ మాటలంటున్నప్పుడు ఆమె కన్నులలో మెదిలిన భావమేమిటో అర్థం కాలేదు శ్రీధర్‌కి.

మర్నాడు ఆమె కాలేజిలో కనబడగానే నవ్వి విష్ చేశాడు శ్రీధర్. "మీ ప్రభావమేమిటో గానీ సాయంత్రం అంత అశాంతిగా ఫీలయిన వాడిని రాత్రి హాయిగా నిద్ర పోయాను. ఈ రోజు చూస్తే శ్వేత వస్త్రధారిణియై శాంతి దేవతలా ప్రత్యక్షమయ్యారు!"

సుశీల చిన్నగా నిట్టూర్చి అంది, "పోనీలెండి! బాధాతప్త హృదయుడైన ఒక మనిషికి నా వలన కాస్త శాంతి చేకూరిందంటే నాకూ సంతోషమే..."

లంచ్ అవర్‌లో సమ్మె గురించి కాసేపు మాట్లాడిన తర్వాత శ్రీధర్ చటుక్కున అన్నాడు. "నిన్నటి నా అశాంతికి కారణమడగలేదేం మీరు?"

క్షణకాలం తటపటాయించిన సుశీల నెమ్మదిగా అన్నది "స్వల్ప పరిచయంలో మీ విషయాలు గురించి అడగడం అవివేకమనిపించింది."

"మీతో చెప్పుకుంటే కొంత ఊరట లభించగలదని నా కెంతగానో అనిపించింది గానీ అతి చనువని అపార్థం చేసుకుంటారేమోనని మౌనం వహించాను." శ్రీధర్ గొంతు ఆత్మీయంగా పలికింది.

"నిష్కల్మషంగా స్నేహంకోరి వచ్చిన వారి గురించి అలా ఎప్పుడూ అనుకోను. నిర్మలంగా నవ్వి అన్న సుశీల కళ్ళలోనికి సూటిగా చూడలేక తల తిప్పుకున్నాడు శ్రీధర్.

మరొకరోజున చెప్పాడతను తన ప్రాణానికి ప్రాణమైన తల్లి మంచంలో తీసుకుంటున్నదనీ, ఒక్కగానొక్క చెల్లెలు పెళ్ళయిన ఏడాదికే విధవయై ఇల్లు చేరిందనీ..

అంతా విని జాలిగా నిట్టూర్చింది సుశీల. "ఎన్నో ఆశలు పెట్టుకుని కోరుకున్నది పొందలేని నిస్సహాయతలో విలపిస్తారు, కొందరు. అవకాశం వుండీ అందుకోలేని ఆశాభంగంతో తపిస్తారు మరి కొందరు." శూన్యంలోకి చూస్తూ అంటున్న సుశీల గొంతు ఎక్కడినుండో మాట్లాడుతున్నట్టు అక్షరక్షరంలో ఆవేదన నిండి వినిపించింది శ్రీధర్‌కు. చకితుడై ఆమెకేసి చూసాడతను.

తేరుకుని చిన్నగా నవ్వేసి సంభాషణ మార్చింది సుశీల.

సమ్మె ముగిసి పాఠాలు మొదలయిన కొద్ది రోజులకే సంక్రాంతి సెలవులు వచ్చాయి. సుశీల ఊరికి వెళ్ళేరోజు స్టేషన్‌కు వెళ్ళిన శ్రీధర్ రైలు కదులుతుండగా అన్నాడు "మీరీసారి వచ్చేటప్పుడు కలకల్లాడుతూ రావాలి. అలా ఏదో పోగొట్టుకున్నట్టు విచారంగా వుంటే నాకెందుకో కష్టంగా వుంటుంది. ఆత్మీయునిగా ఎంచకపోయినా స్నేహితునిగా మీకు సహాయపడే అవకాశం నాకివ్వండి. మొక్కుబడిగా ఏదో చెప్పాలని మొదలు పెట్టిన శ్రీధర్ తన మాటలలో వినిపించిన ఆరాటానికి, అభిమానానికి విస్తుపోయాడు 'ఎందుకలా అన్నాను అనుకుంటూ.

సెలవుల తర్వాత కాలేజికి వచ్చిన సుశీలలో కనిపించిన కొద్దిమార్పు ప్రక్క వాళ్ళ దృష్టిని ఆకర్షించింది. తనంతట తానుగా శాస్త్రిని పలుకరించి "సెలవులు బాగా గడిపారా?" అనడిగింది.

శ్రీధర్‌ని నవ్వుతూ మాట్లాడించి అతని తల్లి, చెల్లెలు ఎలా ఉన్నారో విచారించింది.

"మా చెల్లెలికి మళ్ళీ పెళ్ళి చెయ్యడానికి బ్రహ్మ ప్రయత్నం మీద మా నాన్నను ఒప్పించానండీ... ఇక అంతటి సహృదయుడెవరన్నా ఉన్నాడేమో చూడాలి" సంభ్రమంగా అన్నాడు శ్రీధర్.

"నిరాశలో కృంగిపోతున్నప్పుడు హఠాత్తుగా దయగలిగి ఒక ఆశారేఖను చూపించడం దేవునికి వేడుక కాబోలు" సాలోచనగా తనకు తానే చెప్పుకుంటున్నట్టుగా అంది సుశీల.

ఆ ధోరణికి మరొక్కసారి ఆశ్చర్యపడి లోతుగా ఆమె కళ్ళలోకి చూస్తూవుండిపోయాడు శ్రీధర్.

అంతకుముందు క్లాసులు లేనప్పుడు పుస్తకం చేతపట్టుకుని ఆలోచిస్తూ శూన్య దిక్కులతో కూర్చుండిపోయే సుశీల అప్పుడప్పుడూ మిగతావాళ్ళతో మాట్లాడం. పత్రికలూ పుస్తకాలూ చదవడం చూసి శ్రీధర్‌ని అభినందించారు అతని స్నేహితులు. శ్రీధర్ కది గర్వకారణమే అయినా 'ఆమెను తను మోసం చేస్తున్నాడన్న భావన మనసులో ఏమూలో ముల్లులా మెదిలింది.

ఉగాదినాడు ఉదయాన్నే సుశీల యింటికి వచ్చాడు శ్రీధర్.

"మీరెప్పుడూ ఉత్సాహంగా, సంతోషంగా ఉండాలనీ, మీరు కోరుకున్నవి జీవితం మీ కందించాలని మనస్ఫూర్తిగా కోరుతున్నాను." పండ్లు పూవులు అందిస్తూ శుభాకాంక్షలంద జేశాడతను.

సుశీల కనులలో లీలగా తడి కనిపించింది. "ఏదో మంచి భవిష్యత్‌లో జరగబోతుందనే ఆశేలేకపోతే మనిషి బ్రతకడమే కష్టమవుతుంది?" నిరాశగా అన్నదామె.

శ్రీధర్ గుండె కలుక్కుమంది. కొద్ది రోజులుగా ఆమె నిష్కల్మష మైత్రి, లలిత స్వభావమూ, ముగ్ధత్వమూ అనుక్షణమూ అతనికి తనలో హైన్యతనూ మోసాన్ని, ద్రోహబుద్ధినీ ఎత్తిచూపి పరిహసించుతున్నాయి.

అత్యంతాత్మీయుడైన వారికి హృదయావేదన వెళ్ళబుచ్చుకున్నట్టుగా ఉన్న ఈ మాటలు వినగానే ఆమెను చేరదీసి, ఊరడించాలనీ, తలనిమిరి ఆశ్వాదించాలనీ, బాసటయై నిలవాలనీ బలవత్తరమైన ఒక భావన చెలరేగిందతనిలో.

"మీరేమీ అనుకోకపోతే జరగనిదాని కోసం జరగబోయేదాని కోసం బాధపడుతూ మిమ్మల్ని మీరు నిర్లక్ష్యం చేసుకోవడం ఏమీ బాగాలేదు కనీసం నాకోసం, మీ స్నేహితులకోసం మీరు సంతోషంగా ఉండాలి" ఆర్ద్రంగా అన్నాడతను.

X X X

"ఏమోయ్! మంత్రం బాగానే పారినట్టుందే. మన సంఘసేవి, ఈ మధ్య డ్రెస్ విషయంలోకూడా శ్రద్ధ తీసుకుంటూంది" తమాషాగా నవ్వి స్నేహితుడి భుజం తట్టాడు మూర్తి! శ్రీధర్ చిన్నగా నిట్టూర్చి ఊరుకున్నాడు.

చెల్లెలికి పెళ్లి కుదిరిందని చెప్పడానికి శ్రీధర్ వెళ్ళినరోజున చాలా ఉత్సాహంగా కనబడింది సుశీల.

"ఇంకేం?" మీ పెళ్ళికెప్పుడు పిలుస్తారు మరి?" అంది నవ్వుతూ,

"వితంతు వివాహాని కొప్పించాను మా ఇంట్లో వాళ్ళని. ఇక వర్ణాంతర వివాహాని కొప్పించాలి." ఆమె కనులలోకి చూస్తూ అన్నాడు.

"అంటే? మీ రెవరినైనా ప్రేమించారా?"

జాలిగా తనవైపు చూస్తున్న సుశీల ఎదుట నిలబడలేకపోయాడు శ్రీధర్. తలవంచుకుని దోషిలా నిలబడి అన్నాడు "నన్ను క్షమించు సుశీలా... నేను చెప్పేది విన్నాక సహృదయంతో నన్ను క్షమించగలిగితే నా అంత అదృష్టవంతుడుండడు. సుశీలా నేను మిమ్మల్ని..."

"పోస్ట్" అన్న పిలుపుతో సుశీల గుమ్మం వద్దకు వెళ్ళింది. ఉత్తరం చింపి చదువుతున్న సుశీల మొహం కోటికాంతులతో వెలిగిపోయింది.

"శ్రీధర్ మీది నిజంగా అమృత వాక్కు ఏ చల్లనివేళ మీ శుభాకాంక్షలందించారో.."

సుశీల మాటలు వింటూ సంభ్రామాశ్చర్యాలలో మునిగిపోయిన శ్రీధర్ తేరుకుని "ఏమిటండి అది? నాకేం అర్థం కావడంలేదు" అన్నాడు.

"మీకిన్నాళ్ళుగా మనసువిప్పి చెప్పలేకపోయాను శ్రీధర్‌గారూ! మా బావ శేఖర్ నేనూ పెళ్ళి చేసుకోవాలనుకున్నాం కానీ... కానీ శేఖర్‌కి టి.బి. ఉన్నట్టు తెలిసి మా నాన్న మా పెళ్ళికి అనుమతించలేదు. పైగానాకు వేరే సంబంధం తేవడానికి ప్రయత్నించారు. అందుకే నా అన్నవాళ్ళందరికీ దూరంగా ఈ అజ్ఞాత వాసం గడిపానిన్నాళ్ళు. నేను శెలవులకు వెళ్ళినప్పుడు శేఖర్‌కి పూర్తిగా నయమయినట్టు తెల్సింది. అప్పటికి నాన్న ఏ మాట చెప్పలేదు. కానీ ఈరోజు ఓహ్ శ్రీధర్‌గారూ! నా జీవితంలో పండుగ రోజు..!" పట్టరాని ఆనందంతో చెప్పుకుపోతున్న సుశీల కన్నులనుండి సంతత ధారగా స్రవిస్తున్నాయి అశ్రువులు.

స్థాణువులా నిలబడి చివరవరకువిన్న శ్రీధర్ పెదవులపై ఒకరకమైన విరక్తితో కూడిన మందహాసం తొంగి చూసింది. కనులలో తడిని ఆమెకు కనబడనీయకుండా ముఖం వాల్చి "చాల సంతోషం సుశీలా! మీరు సంతోషంగా ఉండడంకన్న నాక్కావలసింది ఏమీలేదు." అనేసి వడివడిగా ఇంటిదారి పట్టాడతను. అతడు చెప్పదల్చుకున్న విషయమేదో చెప్పకుండానే వెళ్ళిపోతున్నాడని గుర్తొచ్చిన సుశీల గుమ్మం దగ్గరికి వచ్చి "శ్రీధర్ గారూ మాట" అంటూ పిల్చింది. ఆ పిలుపు వినిపించుకోకుండా ఏదో కోల్పోయిన వాడిలా తలవాల్చుకొని, బరువుగా అడుగులు వేస్తూ వెళ్ళిపోతున్న అతగాడిని తెల్లబోయిచూస్తూ నిలబడిపోయింది సుశీల.

"జయశ్రీ" మాస పత్రిక

తేది : సెప్టెంబరు, 1971.